అద్దెకు 'ఆహ్లాదం'


ఎన్టీఆర్ చౌక్ వినాయకుడి మండపం వద్ద మొక్కలు

- నర్సరీల్లో రెంటల్ ప్లాంట్స్
- వేడుకల్లో ఆకట్టుకుంటున్న మొక్కలు
- వినాయక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ

ఆదిలాబాద్: మనసు ఆహ్లాదకరంగా ఉండాలంటే పరిసరాల్లో పచ్చదనం ఉండాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వాలు రూ. కోట్లు వెచ్చించి మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఒక ఉద్యమంలా పచ్చదనాన్ని వృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేస్తున్నాయి. మరోవైపు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పచ్చదనంతో మెరిసేలా మొక్కలు నాటుతున్నారు. నీడనిచ్చే చెట్లతో పాటు, ఆకర్షించే పూల మొక్కలు రంగురంగుల


జిల్లా పంచాయతీ కార్యాలయంలోని మొక్కలు

ఆకులో ఉండే విదేశీ క్రోటన్ మొక్కలను పెంచుతూ ఇంటిని అందంగా అలంకరించుకుంటున్నారు. వీటిని నర్సరీల్లో కొనుగోలు చేస్తూ, నివాసాల చెట్టు, వారి నివాసంలో ప్రకృతి కళకళలాడేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అయితే నర్సరీల్లో ప్రస్తుతం మొక్కలను అద్దెకివ్వడం అనే కొత్త ట్రెండ్ స్టార్ట్ అయింది. ఇంట్లో, ఫంక్షన్ హాల్‌లో శుభకార్యాలు, వేడుకల సమయంలో వేదిక వద్ద, పరిసరాల్లో ఆకట్టుకునే మొక్కలను అద్దెకు ఇస్తున్నారు. పెద్ద, చిన్న సైజుల్లో వీటిని రెంట్‌కి ఇస్తూ కొత్త ఆలోచనతో ముందుకు వస్తున్నారు.

అందుబాటు ధరల్లో...

మొక్కలు రూ. 50 నుంచి రూ. 30 వరకూ అద్దెకు దొరుకుతున్నాయి. నిర్వాహకులే తీసుకెళితే తక్కువ ధరకు ఇస్తుండగా, నర్సరీ నిర్వాహకులు తీసుకెళ్తే కొద్దిమేర అధికంగా వసూలు చేస్తున్నారు. అందుబాటు ధరల్లోనే ఉంటుండడంతో వీటిని అద్దెకు తీసుకోవడానికి జనం మొగ్గు చూపుతున్నారు.

వినాయక మండపాల వద్ద ఆకర్షణ..

ప్రస్తుతం వినాయక చవితి వేడుకల్లో భాగంగా వివిధ వినాయక మండపాల వద్ద మండప నిర్వాహకులు ఆకర్షించే మొక్కలను అద్దెకు తీసుకువస్తున్నారు. స్టేజ్ పైన, ద్వారాల వద్ద, పరిసరాల్లో వీటిని పెడుతున్నారు. దీనివలన పచ్చదనంతో పాటు, ఆహ్లాదంగా, అందంగా పరిసరాలు దర్శనమిస్తున్నాయి. వినాయకుని చూడడానికి వచ్చిన భక్తులు సైతం, ఈ ఆహ్లాదకర వాతావరణంలో ఉండడానికి ఇష్టపడుతున్నారని మండలి నిర్వాహకులు తెలుపుతున్నారు.

- 11 రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు రహదారులపైనే శాశ్వతంగా మొక్కలు నాటే అవకాశం లేకపోవడంతో, ఇవి ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జిల్లా పంచాయితీ కార్యాలయంలో వినాయకుని ప్రతిష్ట కోసం శాశ్వతంగా మొక్కలు నాటడం మరో విశేషం.

ఘనంగా వినాయక నిమజ్జనం


ఇచ్చోడ: నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


బజార్‌హత్నూర్‌లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర

ఇచ్చోడ: మండలంలో అడేగామ(బి), కోకసమన్నూర్, రెడ్డి కాలనీలలో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. అడేగామ (బి)లో సంప్రదాయబద్ధంగా భజన సంకీర్తనలతో వినాయకుడి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సమీప వాగులో నిమజ్జనం చేశారు.

బోథ్: మండల వ్యాప్తంగా తొమ్మిదవ రోజు గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగింది. మండలంలోని సొనాల గ్రామంలో సార్వజనిక గణేశ్, హిందూ ధర్మ జాగరణ గణేశ్, కనుగుట్ట గ్రామంలో హనుమాన్ ఆలయ కమిటీ గణేశ్‌ల నిమజ్జనాలు కొనసాగాయి. సాంప్రదాయ పద్ధతిలో గణనాథులను నిమజ్జనం చేశారు. సొనాలలో హిందూ ధర్మ జాగరణ మండలి సభ్యులు భజనలు, భక్తి పాటలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం గణనాథుల నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, భక్తిపాటల మధ్య భారీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వాగుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు హనుమాన్ కాలనీలో లడ్డూను ఓరగంటి నవీన్ రూ.16000లకు, బోయవాడలోని లడ్డూను తాళ్ల భీమేష్ రూ.10 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. అనంతరం డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ.. సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ శివాజీ మార్కెట్ గణేశ్ మండలి, చింతలసాంగ్వీ ఆదివాసీ యూత్ గణేశ్ మండలి సభ్యులు ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.


బోథ్: సోనాలలో నృత్యం చేస్తున్న యువకులు

నేరడిగొండ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వడూర్ గ్రామంలో వినాయక నిమజ్జనం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. సాయంత్రం నుంచి మొదలైన ఊరేగింపు రాత్రి వరకు కొనసాగింది. యువకులు, చిన్నారులు కేరింతలతో నృత్యం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.56 వేల ధర పలికిన లడ్డూ

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో హనుమాన్ రెడ్డి యూత్ గణేశ్ మండలి వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన తక్కల రవీందర్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. రూ.56 వేలకు వేలం పాడి లడ్డూను పొందారు.

జాతీయ గీతాలాపనతో మొదలైన నిమజ్జనం

బోథ్: మండల కేంద్రంలోని లోకమాన్య గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనం ఆదివారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం జాతీయ గీతాన్ని ఆలపించి నిమజ్జనం ప్రారంభించారు. హిందూ ధరాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, ప్రతిఒక్కరూ దేశభక్తిని చాటాలన్నారు. గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

సాయుధ పోరాట ఫలితమే తెలంగాణ


ఇచ్చోడ: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు


గుడిహత్నూర్: నినాదాలు చేస్తున్న నాయకులు


బోథ్: అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుడిహత్నూర్: రైతాంగ సాయుధ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సీపీఐ జెండా ఎగురవేసి మాట్లాడారు. సాయుధ పోరాటాల్లో అమరులైన ప్రతి ఒక్కరికీ నివాళులర్పిస్తామన్నారు. హక్కులసాధన, పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గజంగుల రాజు, కుశాల్, శ్రీకర్, జమీర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయిందని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అన్నారు. ఆదివా రం మండల కేంద్రంలో తెలంగాణ రైతంగా సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సీపీఐ జెండా ఆవిష్కరించారు. భూమి, భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం నడిచిందని, ఈ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని గుర్తుచేశాఉ. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహా య కార్యదర్శి సిర్ర దేవేందర్, గజంగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచిన ఘనత సీపీఐదే

బోథ్: తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా పేదలకు భూములు పంచిన ఘనత సీపీఐ పార్టీదేనని సీపీఐ నాయకులు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. రాజాకార్లకు వ్యతిరేకంగా దున్నేవాడిదే భూమి, వెట్టి చాకిరీని నిర్మూలించడానికి పోరాటం చేసన అమరుల త్యాగాలు మరవలేనివని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సిరిపురం దాసు, భోజన్న, పట్టణ అధ్యక్షుడు నరేశ్, మున్సిఫ్, కార్తీక్, సుమేర్ పాషా పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2005– 06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక చోట కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు చదువు చెప్పిన గురువులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటుతాం


పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: కొత్త టీపీసీసీ చీఫ్ నేతృత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఒక దళిత, రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన నాయకులకు అవకాశమిచ్చిన గొప్ప సంస్కృతి కాంగ్రెస్ పార్టీదన్నారు. సమర్థుడైన మహేశ్‌ను నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం కానుందని ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ అధ్యక్షుడి బాధ్యత స్వీకరణ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, డేరా కృష్ణారెడ్డి, అఖిల్ రెడ్డి తదితరులు ఆదివారం ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. గాంధీభవన్‌లో జరిగిన మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. ఆదివారం జడ్చర్లలోని అవాంచ గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తుల శ్రీనివాస్, కుమ్ర రాజు, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన


ఆర్టీసీ సేవలను వివరిస్తున్న వీబీవోలు

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామంలో ఆదివారం ఆర్టీసీ అందిస్తున్న సేవలపై గ్రామస్తులకు ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఆర్టీసీ వీబీవోలు శ్రీనివాస్, మధు ఆర్టీసీ ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయితీపై వికలాంగులకు పాస్‌లు అందజేయడం, వివాహాలకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్ర యాణించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చన్నారు. గ్రామ పెద్దలు ధనుంజయ్, కిషన్, రాజ్‌బలి ఉన్నారు.

సేంద్రియ పంటల పరిశీలన


పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్

బోథ్: మండల కేంద్రంలోని ఏఈవో వైద్య సంతోష్‌కు చెందిన భూమిలో సాగు చేస్తున్న సేంద్రీయ పంటలను వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ ఆదివారం పరిశీలించారు. ఐదెకరాల్లో గత పదేళ్లగా ఆయన సేంద్రీయ వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. ఐదెకరాల్లో అన్ని రకాల పంటలను పండించినట్లు ఆయన తెలిపారు. మామడి, నిమ్మ, దానిమ్మ, సపోట, ఎర్రచందనం, శ్రీగంధం, టేకు, మల్బారి వేప (ఫ్లెవుడ్), ఆపిల్, చెరకు, కూరగాయలు సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. సాగు తీరును శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు ఆకుల భోజన్న, చట్ల దివ్వయ్య, సోమ శంకర్, భగవాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న దర్శనాల మల్లేష్

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదీవేనగర్ లో ఆదివారం మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రజల మధ్య భావోద్వేగా లను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. దేశంలో పేదరికం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బండి దాత్తాత్రి, మంజుల, జమున, శకుంత ల, సురేందర్, స్వామి, సురేశ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దాజీశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాంసి: ఆదిలాబాద్ తొలి శాసనసభ్యులు కామ్రేడ్ దాజీశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు విలాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని సావర్గాం గ్రామంలోని దాజీశంకర్ స్థూపం వద్ద సీపీఐ జిల్లా నాయకులు జెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ జిల్లాలో రాంకిషన్ శాస్త్రితో కలిసి కామ్రేడ్ దాజీశంకర్ సాయుధ పోరాటం చేశారని గుర్తుచేశారు. 3 వేలకు పైగా గ్రామాల్లో 10లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్ట్ పార్టీ పేదలకు పంచిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామకమిటీ అధ్యక్షుడు సట్వాజీ, జిల్లా నాయకులు చిలుక దేవిదాస్, రమేష్, భూమన్న, భగువాండ్లు, ముస్తఫా, పాషా పాల్గొన్నారు.

శివరాం సేవలు చిరస్మరణీయం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: జిల్లాలో హిందీ భాషాభివృద్ధికి కృషిచేసిన గుజరాతి శివరాం సార్ సేవలు చిరస్మరణీయమని హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆయన సంస్మరణ సభలో పాల్గొన్నారు. జిల్లాలో హిందీ భాషా పండితులను తయారు చేయడంలో ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ హిందీ గొప్పతనాన్ని జిల్లాలో వ్యాపింపజేస్తామన్నారు. హిందీ కవులు, సాహిత్యకారులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, చంద్రశేఖర్, రవి, జావిద్, జాకీర్, శ్రీహరి, పద్మ, రేఖ సాంబన్న, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాచారం

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన క్రికెటర్ బచ్చుల శ్రీహరి ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబానికి మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాతరి రమేష్ మాట్లాడుతూ అతి చిన్న వయసులో గుండెపోటుతో మృతి చెందడం తీరని లోటని అన్నారు. నాయకులు ఎల్మాల నగేశ్, బొమ్మన రవికాంత్, బొర్రా నగేశ్, రాచర్ల నారాయణ, అగ్గిమల్ల గణేశ్, పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో ఆదివారం విద్యుత్ తీగలు తగిలి కేస్వే సునీల్‌కు చెందిన ఎద్దు మృతి చెందింది. ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం సమీపంలో మేత మేస్తుండగా కిందపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ నిలిపివేశారు. ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ముస్లిం యువకుడి అన్నదానం

బోథ్: మండల కేంద్రంలోని శివశక్తి గణేష్ మండలి వద్ద ముస్లిం యువకుడు షేక్ షాకీర్ ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు వినాయకునికి పూజలు నిర్వహించి, అన్న ప్రసాదాలు స్వీకరించారు.

పింఛన్లు పెంచాలి

బోథ్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.6 వేలకు పింఛన్ పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు పెంచలేదని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మేడిచెల్మ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు.

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డి ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి పాల్గొని, పలువురిని సన్మానించారు.

ముగ్గురిపై కేసు

బేల: మండల కేంద్రం శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బంది నిర్వహించిన దాడిలో ముగ్గురు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని, వారి నుంచి రూ.10,800 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌక్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సోమవారం నిర్వహించే గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించి, పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే 'ఫోన్‌ఇన్'

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకొని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో ఫోన్‌ఇన్ చేపట్టారు. ఉట్నూర్, జన్నారం, కడెం, పెంబి, ఇంద్రవెల్లి మండలాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సీసీరోడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: మండలంలోని మెండపల్లి గ్రామానికి చెందిన శిర్పట్ హనుమన్ ఇటీవల అడవి పంది ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు,. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఆర్థిక సాయం చేయాలన్నారు. అనంతరం పిప్రి, దేవాపూర్, దనోర(బి) గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: పీఆర్టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కటుకూరి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌చందర్ ఠాక్రే, ప్రధాన కార్యదర్శి కూడాల రవీందర్ రెడ్డి, మండల విద్యా శాఖాధికారి భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఇచ్చోడ: మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకోవాలని మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని భీమన్న ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరమల్ల నారయణ, మాజీ ఉప సర్పంచ్ లోకశిరీష్‌రెడ్డి, నాయికపోడ్‌సంఘం నాయకులు పెరమల్ల పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధమార్గాన్ని అనుసరించాలి


బుద్ధుడి ప్రవచనలు బోధిస్తున్న భిక్షువులు

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ గౌతమ బుద్ధుడి మార్గాన్ని అనుసరించాలని బౌద్ధ భిక్షువులు జివక్, పూర్ణ, ప్రజ్ఞాశీల్ అన్నారు. వర్షవాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కేస్లాపూర్ పరిధిలోని కేస్లాగూడ గ్రామంలో పవార్ శివాజీ ఇంట్లో నిర్వహించి భిక్షువులకు అన్నదాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడి చరిత్రపై ప్రవచనలు చేశారు. అంతకు ముందు బుద్ధ ధమ్మ, సంఘ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు, మహామాయ ఉపసిక మహిళ సంఘం సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

రేపు అత్యవసర సమావేశం


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: ఆసిఫాబాద్, కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనపై ఈనెల 17న ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో 9 తెగల ఆదివాసీ పెద్దలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గొండ్వాన పంచాయతీ రాయి సెంటర్ ఆధ్వర్యంలో కేస్లాపూర్ గ్రామపటేల్ మెస్రం వెంకట్‌రావ్ అధ్యక్షతన ఈనెల 17న నిర్వహించే అత్యవసర సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాయిసెంటర్ సార్‌మెడిలు, ఆదివాసీ పెద్దలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నామకులు సిడాం భీంరావ్, తుమ్రం జుగాదిరావ్, మెస్రం వెంకట్‌రావ్, టికం భాస్కర్, గోడం గణేష్, టికం భీంరావ్, పుర్క బాపురావ్, ఆర్క ఖమ్ము, కొట్నాక్ భారిక్‌రావ్ పాల్గొన్నారు.